# బిక్షుక శ్రీల కనీసప్రణాళిక

కథానిక

రంగారావుగారి గోష్ఠిసమావేశంలోనుంచి అప్పుడే బైటపడ్డాను. ఆయన సామాన్య వైద్యుడుమాత్రమే కాదు. తాతగారైన గోవింద దాసుస్వాముల వేదాంతశిక్షణలో ఆరితేరి ప్రాణికోటిపై ప్రత్యేక సిద్ధాంతాలున్న వ్యక్తి. కాబట్టే వారి అనుదినోపన్యాసాలు అస్మదాదులైన మిత్రుల హృదయాలపై మత్తుమందు చల్లుతాయి. వెన్నెల... సైకిలు బజారుదాటింది. సంత చావడుల సమీపానికి వచ్చాను. నా ప్రశాంతాలోచనలకి వింత దృశ్యమొకటి కానవచ్చింది. ఆ చావడులలోని ముష్టివాళ్ళంతా హడావుడిగా ఉన్నారు. ఆ పరిసరాలు నాకు పరిచయం. ఉండటానికి కొంపగోళ్లులేనివాళ్లు... దినమునకొక ప్రదేశము పర్యటన చేసేవాళ్లు, ఆ సంతచావళ్లలో కీచుమంటూ ఉంటారు. పాడేవాళ్లు...ఆడేవాళ్ళు...పచ్చళ్లు నూరేవాళ్లు...నంజుళ్లుకాల్చేవాళ్ళు, మురికి బట్టల చినుగువేషాలతో దుర్గంధ వాతావరణంతో ఆమార్గాన వెళ్ళేవారికాప్రదేశం ఏహ్యాం పుటిస్తూ ఉంటుంది. పట్టణమధ్యంలో ఈ మాదిరిగుంపులను ఎందుకుండనిస్తారో ఈమ్యునిసిపాలిటీలని నాకునేను మనస్సులో నిందించుకొన్న రోజులున్నాయి. అలాగ వెడుతూనే ఆ భిక్షుకుల వింత తత్వాలను పరిశీలిస్తూ ఉండడంకూడా పరిపాటయింది ఈ నాడు. సంతచావడి సింగారింపబడుతోంది. నా సైకిలు బ్రేకువేసి ప్రక్కనున్న గంగరావిచెట్టు మొదలుమీద కాలువేసి నిలుచున్నాను. నిముషాలలో అలంకరణం అయిపోయింది. మధ్య వేదిక.అటూయిటూ పూల తురాయి కుచ్చులు. పైభాగంలో ముష్టివాళ్లు స్వయంగా తయారుచేసిన చాపలు, రంగుల బట్టలు, దూదిపిట్టలు మామిడాకురొట్టలు వ్రేలాడుతున్నాయి. ఆడవాళ్లు మొగవాళ్లు కిలకిలలాడుతూ సమావేశంలో పాల్గొనడానికన్నట్టు చేరుతున్నారు. నాలుగు వీధులనుంచీ కూడా అలాంటి ముష్టివాళ్ళపంక్తులే ముందుకువస్తున్నాయి. తంబురాలు ధరించినవారు, పట్టెవర్ధనాలు పెట్టినవారు, చింకిరి తలలూ, జీబురు గడ్డాలు, వెన్నెలలో స్పష్టంగా ప్రదర్శింపబడుతున్నాయి.

నేనే వివశభావాలలో ఉన్నానో, కార్యక్రమం అప్పుడే ప్రారంభమయింది. పరిశుద్ధ ఖద్దరు వేషధారి గాంధీటోపీలో కాంతివంతమైన అధ్యక్షాసనంలో ఉన్నాడు, ఎవరా అని కళ్లుతుడుచుకొని పరిశీలించాను. ఎన్నికల తదనంతరం నాకిదే తొలిసారి కాంగ్రెసు నాయకుల బహిరంగసభాధ్యక్షతను చూడడం. ఆ అధ్యక్షులను పోల్చలేకపోయేను. ఎవరైతేనేమి? సమస్త ప్రాణికోటి రక్షణకు ప్రాతినిధ్యము వహించిన వర్గమువాడు. ముఖ కవళికలు బాధ్యతనే సూచిస్తున్నాయి. హృదయ స్థితి దేవుడికి తెలియాలి. సభలోకి చూశాను. అన్ని ముఖాలు పరిచయమే. అందరూ లేచి నిలబడ్డారు. అందబిక్షువొకడు తంబురా శ్రుతిలో జాతీయగీతం పాడాడు. నా వొళ్లు పులకరించింది. అధ్యక్షులవారిలో సంచలనము లేదు. నిలువునా కూర్చున్నారు. తొంటచేయి పోలయ్యయొకడు చిటికెల వాయిద్యం, ముళ్ళపొదలాంటి తలవాడొకడు మోర్సింగూ, మెడలో పెద్ద రేకొకటి వ్రేళ్ళాడుతున్న బక్కడొక్కు ఒకడు డోలు, నలుగురు ఆడవాళ్లు మ్రోతగా ఏదో ఒక కచ్చేరీలా చేశారు. ఇద్దరు ముత్తైదువలు హారతి పట్టి అధ్యక్షులకు దండవేశారు. ఇప్పుడు అధ్యక్ష్యులవారిలో ఒక చిరునవ్వు మెరసింది. సన్మానపత్రం చదవడానికొక సన్న పొడుగుమనిషి లేచాడు. వ్యక్తిలోనుండి క్షయ లక్షణాలు తొంగి చూస్తున్నాయి. అధ్యక్షుల వారు సన్మానపత్రచట్రంకేసి ఆసక్తితో, ఆదుర్దాతో చూశారు. ఆ బుక్కా వేషధారి చదవడానికి గొంతు సవ

కొండూరి నరసింహం

రించుకొన్నాడు. సభ నిశ్శబ్దం.

గౌరవనీయులైన అధ్యక్షా! అవధారు. శతాబ్దాలుగా సతమతమవుతూ బంగారుభారతదేశంలో మా అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ వచ్చిన మా పూర్వులను వర్తమానులను స్మరించుకుంటూ, కలలలోనైనా మాజీవితాలజోలికిరాక మాముష్టిజోలులను శాశ్వతత్వాన్ని ప్రసాదించుచున్న ప్రస్తుత ప్రభుత్వప్రతినిధులైన మిమ్ము సమ్మానించుకోగల స్వల్పసదవకాశములభించిన మేమెంతయుగర్వించుచున్నాం. అనేకప్రభుత్వకార్యకలాపాలలోప్రజల మొగము చూడడానికైనా తీరికలేని మీరు మా సభాధ్యక్షతను సమాదరంతో స్వీకరించినందులకు మా భిక్షుకలోకం తరపున ధన్యవాదాలు. మానవున కొక సమస్యగా మొలచిన మా కంటక సంఘంలో మీరు బాధ్యతతో మెలకువగా పదవులు నిర్వహించుచున్న ధైర్యానికి, మీ అచంచల శీలమునకు మా జోహారులు...అస్తు. ..

తిండిలేక మాడుతున్న మధ్యవర్గ ప్రజలలోగాని, అన్ని సౌఖ్యాలకు దూరమైన హరిజన సంఘములలోగాని, కాలికొద్దీ గ్రామాల వెంబడి పరుగెత్తుచున్న కాందిశీక శ్రేణులలోగాని, మా భిక్షుక సంఘాన్ని యిరికించి మా పరపతికి భంగం కలిగింపకుండా కాలక్షేపం చేసికొస్తూన్న కాంగ్రెసు ప్రభుత్వానికి మా భిక్షుక సంఘం అనవరతమూ అండగా ఉంటుంది. ఎదుటి ఆసామీని కరగించి ఇంతోఅంతో (దానికి లంచమని పేరు పెడతారు మూర్ఖులు) ఆంకించుకోగలిగిన మీ ప్రభుత్వ సిబ్బందికిన్నీ, అదే ఛాయలలో ఆర్జనకుపక్రమించే అనధికార భిక్షు సంతతికిన్నీ అంతభేదం లేదని వంచించడం మీకంత యిబ్బందిగా ఉండకూడదు ... ఉండదు...అని మా సంఘ విశ్వాసం. అనేక సమస్యలలో అంతర్ముఖులై అవస్థపడుతున్న మీ బోటులకు మా అనుయాయులు అనవసర శ్రమ కలిగించడం అన్యాయమని ఘోషిస్తున్నారు. ఆహార సమస్యను అంతర్ధానం చేసే మీ ప్రణాళికలలో మా సంఘం మీకెట్టి విషమ సమస్యను ఉత్పాదింప చేయదని మేము భరోసాయిస్తున్నాము. ఏ యఖండుడైనా కరువు కాటకాలను కాల్చివేయడానికి ప్రాతిపదికగా మా భిక్షుక సంఘాన్ని రూపుమాపాలని సలహానీయడం విదేశరాజ్యాంగ సూత్రవినీతానుసారులైన, మీబోటులు మమ్ముల నే బోటులపైననో యెక్కించి సముద్ర గర్భంలో సమయింప జూడడం...తటస్థించునేమో అని మా సంఘం లోలోపల భయపడుతున్నా, వేదాంతదేశంలో జన్మించిన మీరట్టి చర్య కొడబడరని ధైర్య మందుచున్నది. గాంధి దేవుల పవిత్రాశయములకు ప్రతిబింబమైన భారత ప్రభుత్వంలో మా వాక్, భావ, వ్యవహార స్వేచ్ఛల కెట్టి భంగము కలుగదని ఆశిస్తున్నాము. మీపై అనేక పక్షములవారు అనవతర విమర్శనా బాణముల విడుచుచున్నను, మే మట్టి తుచ్ఛపు పని నెన్నడును చేయక మీ పవిత్ర రాజకీయములకు దూరముగా వుంటున్నామని హెచ్చరిక...వోటు రేషను కార్డు, ఇంటిపన్ను, ఆదాయపు శిస్తు, జనన మరణ రిపోర్టులు, వంటి యీతిబాధ లేవియు మా సమాజమున కనువర్తింప చేయకుండనున్న మీ ప్రభుత్వమును నమ్రతతో ప్రశంసించుచు రైళ్లలో టికెట్ కలెక్టరులు చేయు కిరాతక కృత్యములను నిషేధించవలసినదిగా మీ ఘనతను ప్రార్థించుచున్నాము. మద్యనిషేధమువంటి మారణాస్త్రము మాకు దూరమగునట్లు మీరు ప్రత్యేకించెదరనియు, ఆ మారణాస్త్రము మా సంఘముపై ఎట్టి ప్రభావమును కలిగింపదనియు విన్నవించుకొనుచున్నాము. పేరు తెలియని వేలాది వ్యాధులు పీల్చి పిప్పి చేయుచున్నను వానిని మేమే సహించి, వానికి తగు ప్రచారము కలిగించి భరించుచున్నాము కాని ఆసుపత్రులకై ఆరాటపడు స్వభావము మాది కాదనిమరిమరి తెలియచేసుకొనుచున్నాము. కులమత తత్త్వములతో కుస్తీలుపట్టి వర్గభేదము చూపుట మా సంఘమున కుదారలక్షణము కాదు. విద్య కావలయుననికాని, ఉచిత విద్యయే కావలయుననికాని మా భిక్షుకు లెన్నడును మీకు వృధా వ్యయశ్రమలను కలిగింపరు. మీ ఎడ్యుకేషనల్ రూల్సులో ఏయే కులమువారికి విద్యా సౌకర్యములున్నవో, ఏఏ వర్గములవారు వాని నెట్లుపయోగించుకొనుచున్నారో మాకు బాగుగా తెలియును. మద్రాసురాష్ట్రములో కొండ కాపులను ప్రత్యేక తెగలేదు. అయినా భూస్వాముల బిడ్డలు చాలామంది కాపులే కొండ కాపులుగా విద్యా సంస్థలలో సౌకర్యము లందుచు, సెంటు భూమిలేని బ్రాహ్మణ విద్యార్థులు విద్యకు

దూరమగుచు, అస్తవ్యస్త పరిపాలనను సాక్షీభూతమగుచున్నను ఆ రూల్సును సృజించిన నాటి జస్టిస్ పెద్దలపై మీకున్న అభిమానమును మా సంఘము గుర్తించి ప్రశంసించుచున్నది. అట్టి సంకుచిత విద్యా సౌకర్యములను మా సంఘమెన్నడు కోరబోదు.

జైళ్ళను సంస్కరించి ఖైదీలకు శిక్షలులేకుండ విద్యావంతులను చేయవలెనను తలతిక్క రాయుళ్లెవరైనను మా భిక్షుకులకు శరణాలయములను కల్పించి విద్యావంతుల నొనర్చి నాగరికతను తేరాదా, దారిద్ర్యమును తొలగించరాదా! వంటి సలహాలనిచ్చినను మీ ప్రభుత్వము పెడచెవిని పెట్టుటయే యుక్తము. అనేక రకములైన చేతి పనులవారు, అతివిచిత్ర మేధా సంపన్నులు మా భిక్షుకలోకంలో లేకపోలేదు. వారి కాశ్రయం కల్గించి వస్తూత్పత్తి అధికముచేసి, దేశీయములైన ఆ వస్తువులనే ప్రజలుపయోగించునట్లొనర్చిన అమెరికావంటి అతిగౌరవదేశములతో మనకుగల లావాదేవీలు సంబంధబాంధవ్యాలు పటాపంచలై పోవును. కాన అట్టి యవివేక ప్రణాళికను ప్రభుత్వమూహించనైనా ఊహించకుండుగాక..... మాలో తరతమ విభేదములు, ఆదాయతారతమ్యములు; కళారాధనా విపరీతరీతులు అనేకములున్నను ఐక్యతకు ఎట్టిభంగము రానీయక మా సమాజమున అసంఖ్యాక నూతన వ్యక్తులను చేర్చుకొనుచు అభ్యున్నతినందుచున్నను ఏ ప్రభుత్వమూ మా సంఘమును గుర్తింపవలసినదిగా ఎన్నడును వత్తిడిని తీసుకొనిరాము. మాలో ప్రతి యొకడును నాయక సాహస లక్షణము లుండుటచే తన్నిరాణయక విషయమునగాని, విరూపపార్టీల విశ్వామిత్ర సృష్టికిగాని ప్రయత్నించి కలహించబోము. పదవీవ్యామోహము లవలేశములేని మా యుదాత్తతను ప్రజలు గుర్తింపకుండుట శోచనీయము. మూర్ఛ, అపస్మారమువంటి రోగముల నటించుటలోను, నవీన గేయ రచనానైపుణ్యంలోను, వివిధస్వరాల నాలపించడంలోను ప్రశస్తి నందిన మహనీయులు లెక్కకుమీరి మాలోనున్నారు. వారిని సినీమాలోకమైనను గుర్తించు సదృష్టమున, నేటి మన సినిమా వ్యవసాయము ఇంత దెబ్బతిని యుండెడిదికాదు. పెట్టుబడిదారులు కోటీశ్వరులై యుండెడివారు.

* * *

అలాగ అతను చదువుతూనే ఉన్నాడు. అధ్యక్షులు ఉగ్రులైపోతున్నారు. ఇది సన్మాన పత్రమా... మరేమైనా... అని వారి యనుమానం. అధ్యక్షులవారి సంతాపమును గుర్తించి నున్నని బోడిగుండు వాడొకడు సోడా నొకదానిని కొట్టి మట్టిగ్లాసులోపోసి టేబిలుపై వారి ముందుంచెను. కూల్ డ్రింకు కాకుండుటచేతనో మరేమో వారు దానిని స్పృశింపనైనాలేదు... చదువువాడు చదువుచునే యుండెను.

* * *

మాలో భూస్తంభన, జలస్తంభన, గజకర్ణ గోకర్ణాది విద్యలను తెలిసినవారనంతము. ఐనను ఆ విద్యలను విశ్వవిద్యాలయములు గుర్తించవలసినదిగా మేము కోరము. ప్రతి యాత్రాస్థలమందును దేవుని సన్నిధిని కొంగులుపరచి మేము తపించుట కొందరు విద్యావంతులకు గిట్టక దూషించుటను ప్రభుత్వం నిషేధించుట న్యాయము... దేనికైనను విరాళములను పోగుచేయవలసి వచ్చు క్లిష్ట సందర్భములలో ప్రభుత్వము మా సంఘమునుపయోగించుకొనుటను మేము హర్షింతుము. ధనికులు, ఇండ్లున్న సంసారులు మాకు విధిగా విసుగుకొనకుండ ముష్టినివైచి యాదరించునట్లు ప్రభుత్వమొక బిల్లును ప్రవేశపెట్టిన ప్రతిపక్షులైన కమ్యూనిస్టుల వాదశక్తిని, పార్టీ శక్తిని కొల్లగొనగలదనియు, రష్యా సలహా లేకుండగనే సామ్యవాదమును కాంగ్రెసువారు ప్రవేశపెట్టిన వారగుదురని మా భావము. బంజరులు వగైరాలు రాజకీయబాధితుల పేర ప్రభుత్వమండలి పెద్దలే కబళించినను మా నగర సంకీర్తనమునకు భంగము రానంతవరకు మాకెట్టి బాధయునులేదు. మాసంఘమునకు స్వతంత్ర చిహ్నమైన పతాకము నొకదానిని (చిప్ప-కర్ర ముద్రింపబడినది) ఉంచుకొనుటకు శ్రీవారంగీకరించి...

సభలో కలకలము. అధ్యక్షులవారు చీకాకుతో సభ విడిచి లేచిపోయిరి. భిక్షుక సంఘమునకు జై అను నినాదములు. చంద్రుడు మబ్బులోనికి నిష్క్రమించుటతో అంధకారము... నా సైకిలు కదలినది.